క్లుప్తంగా

సాయిమందిరం వార్షికోత్సవానికి ఏర్పాట్లు



విశాఖ విద్య: గోపాలపట్నం ప్రశాంత్ నగర్‌లోని షిర్డీ సాయిమందిరం వార్షికోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం వంటి పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు. 28న విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సీతమ్మధార: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ కార్యదర్శి ఎస్.మల్లేశ్వరి మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచేలా పోరాడిన ఘనత మందకృష్ణకు దక్కుతుందన్నారు. దివ్యాంగులకు టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జాతీయ నాయకులు ఆల్బర్ట్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పైడిశెట్టి పాల్గొన్నారు.

క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్ల నిరసన



నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు, లోడర్లు

గాజువాక: జీతాలు సకాలంలో చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కోసం తమ జీతాల నుంచి మినహాయిస్తున్న నగదును ఆయా సంస్థలకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్ క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు మంగళవారం బంద్ నిర్వహించారు. కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బంద్‌తో తడి, పొడి చెత్త సేకరించే వాహనాలు పార్కింగ్ స్థలంలోనే నిలిచిపోయాయి. తమ జీతాలు చెల్లించే వరకు బంద్ కొనసాగిస్తామని ఈ సందర్భంగా కార్మికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, నాయకులు ఎం.రాంబాబు, నక్క నాగరాజు, ఎస్.గణేష్, అనిల్, సురేష్, రాజు, లక్ష్మి పాల్గొన్నారు.

రోడ్ టు స్కూల్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రమణాజీ

పెదగంట్యాడ: ఒకటో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయి సంప్రదాయ లిఖిత, గణన నైపుణ్యాలను పెంపొందించేందుకు రోడ్ టు స్కూల్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మండల విద్యా శాఖాధికారి కె.రమణాజీ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని కేఎస్ పాలెం ఎంపీపీ పాఠశాలలో రోడ్ టు స్కూల్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల మానసిక స్థితి అంచనా వేయడంలో, తల్లిదండ్రుల సమక్షంలో వారికి వ్యక్తిగతంగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఆర్‌టీఎల్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, హెచ్‌ఎస్‌బీసీఎల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 13 ఎంపీపీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని

చెంతనే ఆర్టీసీ డిపో ఉన్నా వారు మాత్రం బస్సు సౌకర్యానికి నోచుకోలేదు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుంది ఆ గ్రామాల ప్రజల పరిస్థితి. దీనికి అధికారుల నిర్లక్ష్యంతో పాటు ప్రజల తప్పిదమూ కారణమే..!. విశాలంగా ఉన్న రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో అధికారులు బస్సులు తిప్పడం మానేశారు. ఫలితంగా ఆ గ్రామాల నుంచి కళాశాలలకు వెళుతున్న విద్యార్థులతో పాటు ఉద్యోగులు, కార్మికులు అవస్థలు పడుతున్నారు.



బస్సులు లేక నడిచి వెళ్తున్న విద్యార్థులు



నాడు: ములగాడ బస్టాప్ సెంటర్ ఇదే

- చెంతనే ఆర్టీసీ డిపో
- అయినా బస్సులు రాని వైనం
- ఉన్న సర్వీసులు నిలిపివేయడంతో అవస్థలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని గొందేశివానిపాలెం,ములగాడ విలేజ్,చిన్న ములగాడ, ఎదురువానిపాలెం గ్రామాలు శివారు ప్రాంతాలు. ఆయా ప్రాంత వాసులు ఏదైనా ఊరు ప్రయాణం చేయాలన్నా.. ఉపాధి కోసం వివిధ పరిశ్రమలకు చేరుకోవాలన్నా.. ఒకటి నుంచి రెండు కిలో మీటర్లు నడవాల్సిందే.. లేక పోతే లిఫ్ట్ కోసం ఎదురు చూడాల్సిందే.. గ్రామాలకు చేరువలో గాజువాక ఆర్టీసీ డిపో ఉన్నా తాము మాత్రం బస్సు సౌకర్యానికి నోచుకోలేక పోయామని ప్రజలు వాపోతున్నారు.

నిలిచిన సర్వీసులు

నాలుగు గ్రామాల ప్రజల వినతి మేరకు ఆర్టీసీ అధికారులు 38 ఎల్, 400 ఎం పేరిట రెండు బస్సులు నడిపారు. దీంతో ములగాడ విలేజ్,చిన్న ములగాడ ,ఎదురవానిపాలెం,గొందేశివానిపాలెం ప్రజలు హాయిగా రాకపోకలు సాగించేవారు. ఒక బస్సు గాజువాక మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్తే, మరో బస్సు మల్కాపురం,సింధియా మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నడిచేవి.దీంతో ఆయా గ్రామస్తులు హాయిగా ప్రయాణాలు సాగించేవారు. కోవిడ్ రావడంతో డిమాండ్ లేక అధికారులు సర్వీసులను నిలిపివేశారు. అప్పటి నుంచి నాలుగు గ్రామాల ప్రజలకు ప్రయాణ కష్టాలు మొదలయ్యాయి. మరలా బస్సులు నడపాలని గ్రామాల పెద్దలు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదు. అయితే కొంతమంది స్వార్థపరులు మెయిన్‌రోడ్డుపైకి నిర్మాణాలు చేశారు.

బస్సు సదుపాయం లేని గ్రామాలు
గొందేశివానిపాలెం, ములగాడ విలేజ్, చిన్న ములగాడ, ఎదురువానిపాలెం

జనాభా	విద్యార్థులు
10 వేలు	800

ఉద్యోగులు, కార్మికులు సుమారు 2000 మంది

విద్యార్థులు, ఉద్యోగులకు ఇబ్బంది



మా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. విద్యార్థులు,ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు హ్యాపీగా ప్రయాణాలు సాగించే వారు. ప్రస్తుతం బస్సులు నిలిచిపోవడంతో విద్యార్థులు,ఉద్యోగులు అంతా ఇబ్బంది పడుతున్నారు. కాలిబాటన కిలో మీటర్ పైగా నడుచుకుంటూ వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తుంది. ఇబ్బందులను అధికారులు గుర్తించి ఆర్టీసీ సర్వీస్‌ను పునరుద్ధరించాలి.

–ధర్మాల వేణుగోపాలరెడ్డి, ములగాడ గ్రామ పెద్ద

అధికారులకు వినతులు ఇచ్చాం



ములగాడవిలేజ్,చిన్నములగాడ,ఎదురువానిపాలెం,గొందేశివానిపాలెం ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని అధికారులకు వినతులు ఇచ్చాం.అయినా స్పందన లేదు. గ్రామాలకు చేరువలో ఉన్నా బస్సులు నడపకపోవడం దారుణం. విద్యార్థులు, వృద్ధులు బాగా ఇబ్బంది పడుతున్నారు

–గురుబిల్లి రామచంద్రరెడ్డి, ములగాడ గ్రామ ప్రధాన కార్యదర్శి

చిన్న బస్సులు లేక నిలిపివేశాం

నాడు బస్సులు వెళ్లే మార్గం విశాలంగా ఉండేది. నేడు రోడ్లు ఇరుగ్గా మారడంతో పాటు ములగాడ టర్నింగ్ పాయింట్ వద్ద వంతెన ఎత్తుగా ఉండడంతో దానిపై బస్సు వెళ్లేటప్పుడు బస్సు దిగువ భాగం తగులు తుండడంతో ఇబ్బందులు వస్తున్నాయి. ప్రస్తుతం అన్ని 60 సీట్లతో ఉన్నాయి. ములుపు తిరగలేక పోవడంతో సర్వీసులు నిలిచాయి.40 సీట్ల సామర్థ్యం గల బస్సు కోసం చూస్తున్నాం. ఆ బస్సు వచ్చిన వెంటనే ఆయా గ్రామాలకు సర్వీస్‌ను ప్రవేశ పెడతాం.

– ప్రవీణ, గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..!

ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి

మల్కాపురం: రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హింస ఎక్కువ అయ్యాయని.. వరుస ఘటనలు చూస్తే రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అన్న అనుమానం కలుగుతుందని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న హింసను ఖండిస్తూ 61వ వార్డు ఆర్‌కేపురంలోమంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు.అనంతరం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఐద్వా నాయకురాలు మమత, సత్యవతి మాట్లాడుతూ లా విద్యార్థినిపై కొంత మంది కిరాతకులు అత్యాచారానికి పాల్పడడం చాలా దారుణం అన్నారు.అలాంటి కిరాతకులను కఠినంగా శిక్షించాల్నారు. రాష్ట్రంలో ఏ మహిళకు అన్యాయం జరిగినా మరు క్షణంలో తాను నిలబడి దోషులకు కఠిన శిక్ష పడే విధంగా పాలన ఉంటుందని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో బాధ్యత లేని పాలన సాగిస్తుందని, అందు వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టి మహిళలకు రక్షణ కల్పించే విధంగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

మరిడిమాంబ అమ్మవారి మంగళ సూత్రాలు చోరీ

- సీసీ ఫుటేజీలో నిందితుడి కదలికలు
- రంగంలోకి దిగిన క్రైం పోలీసులు



సీసీ ఫుటేజీ...

మల్కాపురం: మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి మంగళ సూత్రాలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. వివరాలు.. భక్తుడి మాదిరిగా మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఆలయంలోకి దొంగ ప్రవేశించాడు. అమ్మవారిని ఆరాధిస్తున్నట్టు కొంత సేపు నటించాడు. ఎవరూ గమనించడం లేదని గ్రహించి అమ్మవారి మెడలో ఉన్న సూత్రాలను లాగేసి దర్జాగా ఏ మార్గంలో వచ్చాడో అదే మార్గాన నడుచుకుంటూ వెళ్లాడు. ఈ తంతు అంతా ఆలయం ఆవరణలో,వెలుపల ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఆలయ పూజారులు వెంటనే మల్కాపురం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వచ్చి సీసీ ఫుటేజీ పరిశీలించారు.దొంగతనం చేసిన వ్యక్తి స్థానికుడా లేదా స్థానికేతరుడా అన్న దానిపై ఆరా తీస్తున్నారు. మందిరం సమీపాన మద్యం సేవించిన కొంత మంది ఆకతాయిలు తిరుగుతుంటారని వారిలో ఎవరైనా చోరీకి పాల్పడ్డారా అన్న దానిపై కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.

స్ఫూర్తి ప్రదాత మన అంబేడ్కర్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మళ్ల విజయప్రసాద్, తదితరులు



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో..

సింధియా/మల్కాపురం: భారత రాజ్యాంగ నిర్మాణ దినోత్సవ కార్యక్రమాలు పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ ఏడుగుడుల సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు హక్కులు సిద్ధించాయన్నారు. స్వేచ్ఛ,సమానత్వం,లౌకిక నిర్మాణ రాజ్యం వంటి ఎన్నో అంశాలు రాజ్యాంగం ద్వారా వచ్చిన మార్పులే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీయూ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, వివిధ వార్డుల అధ్యక్షులు ఆడారి శ్రీను, గులివిందల కృష్ణ, పిన్నింటి అప్పలరాజు, రేవళ్ల సత్యనారాయణ, సోమాదుల సురేష్, భీశెట్టి గణేష్, రాయపురెడ్డి అనిల్ ,ఇతర నాయకులు పాల్గొన్నారు.

- గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొలిమేర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

రవాణా శాఖ కార్యాలయంలో..

విశాఖ విద్య: ఎన్ఏడీలోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి డీటీసీ ఆదినారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాలకు రాజ్యాంగం అవకాశాలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఆర్టీవోలు, సహాయ మోటారు తనిఖీ అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీటీసీ

ఆర్పీపేట పాఠశాలలో..

కంచరపాలెం: ప్రజలకు స్వేచ్ఛా వాయువుల అందించిన పవిత్ర గ్రంథం మన రాజ్యాంగం అని ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావు కొనియాడారు. జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులు పి.గీతా, ఉషాకిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం, పి.వెంకటేశ్వరరావు, జి.వి రమణ, చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, హరినాథ్, బి. పరమేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి



58వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ బి.రాము



ప్రజాసమస్యలను జెడ్సీ రాముకు వివరిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

మల్కాపురం: పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని శానిటేషన్ సిబ్బందిని జెడ్సీ బి. రాము ఆదేశించారు. జీవీఎంసీ 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన కార్పొరేటర్ గులిగిందల లావణ్యతో కలిసి పర్యటించారు.గుల్లలపాలెం గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. వ్యర్థాలు ఇంతలా పేరుకుపోతుంటే ఏం చేస్తున్నారని వార్డు శానిటరీ అధికారిని ప్రశ్నించారు. అనంతరం శ్రీనివాస్‌నగర్,రామ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోన్–5 పరిధిలోని పలు విభాగాల ఉన్నతాధికారులతో పాటు నాయకులు గులివిందల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీ దృష్టికి సమస్యలు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో జోనల్ కమిషనర్ రాము మంగళవారం విస్తృతంగా పర్యటించారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రధాన సమస్యలను జెడ్సీకి వివరించారు. ఏకేసీకాలనీలో ఒక్కటే రహదారి ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బీఎస్ఎన్ఎల్ ప్రహరీని ఆనుకొని ఉన్న డ్రైనేజీని తగ్గించి మిగిలిన స్థలంలో చిన్న రహదారి ఏర్పాటు చేస్తే ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో జీవీఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించి రహదారి నిర్మిస్తున్న సమయంలో పోర్టు యాజమాన్యం అభ్యంతరం తెలుపుతూ జీవీఎంసీకి లేఖ రాయడంతో పనులు ఆగిపోయాయని వివరించారు. సమస్యపై పోర్టు అధికారులతో మాట్లాడి రహదారి నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు జోనల్ కమిషనర్‌ను కోరారు. అదే విధంగా మెయిన్ రోడ్‌లో ఉన్న కల్వర్టును బాగుచేయాలని, వర్షం వస్తే మురుగునీరు రోడ్డుమీదకు రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ సునీల్, ఎస్.జనార్దన్, పబ్లిక్ వర్క్స్ ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది హనోక్, రాజబాబు, సత్తిబాబు, సోయల్ తదితరులు పాల్గొన్నారు.


యూపీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



యూపీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలోని తోటగరువు యూపీహెచ్‌సీని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం సందర్శించారు. అక్కడి రికార్డులు తనిఖీ చేశారు. ల్యాబొరేటరీలో రోగులకు జరిపిన వైద్య పరీక్షల రికార్డును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి వైద్యులను అగిడి తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ సంఖ్య, రోగులకు అందించే మందులు, ప్రస్తుతం నిల్వ ఉన్న మందుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో అందాల్సిన వైద్య సేవల గురించి సూచనలు ఇచ్చారు. ఓపీ సంఖ్యను పెంచే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: పేద మహిళలు ఆర్థికంగా బలపడాలనే సంకల్పంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జోన్–5 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని మహిళలకు మంగళవారం కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్వానిధి,స్వాభిమాన్,ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన,ప్రధాన మంత్రి జన్‌ధన్‌యోజన ఇలా అనేక పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. దళారులను నమ్మకుండా ఆన్‌లైన్ ద్వారా పైన పేర్కొన్న పథకాలను ఒక్క సారి పరిశీలన చేసుకుని,వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. 10 మందికి రుణాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రజని,జెడ్సీ రాము తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి ఆటవిక న్యాయం?

ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



మాట్లాడుతున్న ఆదినారాయణ

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించకుండా మానసికంగా వేధించడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన 1384వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. రెండు మాసాల నుంచి జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. కర్మాగార ప్రగతి, ఉత్పత్తిలో కీలకమైన కార్మికులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా వేధించడంతో యాజమాన్యం వైఖరి స్పష్టమౌతుందన్నారు. ఏడు మాసాలుగా జీతాలు వాయిదా పద్ధతిలో చెల్లించిన యాజమాన్యం రెండు మాసాల నుంచి వాటిని కూడా చెల్లించకుండా ఉద్యోగుల కుటుంబాలను దారుణంగా హింసిస్తుందన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, విళ్లా రామ్మోహన్‌కుమార్, ఎం.మహాలక్ష్మినాయుడు, దాసరి సురేష్‌బాబు, శ్రీనివాస్, ఎ.మసేన్‌రావు, డి.దేముడు, జి.ఆనంద్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, సన్నిబాబు, సీతారామరాజు, రాంబాబు, భాష, పాల్గొన్నారు.

29న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కుశలవ ఇంటర్నేషనల్, ఎస్ఆర్ అకాడమిక్ ఆర్గనైజేషన్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మిషన్ ఆపరేటర్స్, షిఫ్ట్ సూపర్‌వైజర్స్, సేల్స్ అండ్ సర్వీస్ ఇంజినీర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 18–35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకుఆ రోజు నేరుగా హాజరు కావచ్చునని పేర్కొన్నారు. విద్యార్హత, వయసు నిర్ధారించే ధ్రువపత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలన్నారు.


ఆరుద్ర కవిత పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: అవంత్స సోమసుందర్, ఆరుద్ర శత జయంతి ఉత్సవాలు ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, అరసం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏయూ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అరసం ప్రచురించిన 'ఆరుద్ర కవిత' పుస్తకాన్ని వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వై.విజయకుమార్, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు మేడిపల్లి రవికుమార్, ఆచార్య చందు సుబ్బారావు, అరసం నాయకులు ఉప్పల అప్పలరాజు, క్షేత్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న పీకే పట్నాయక్

తాటిచెట్లపాలెం : రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ అహర్నిశలు కృషి చేస్తోందని యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పీకే పట్నాయక్ తెలిపారు. డిసెంబర్ 4, 5, 6న నిర్వహించే రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ప్రచారం కోసం విశాఖపట్నం విచ్చేసిన పీకే పట్నాయక్ మంగళవారం దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, జోనల్ స్థాయిలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ కార్మికుల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఎన్నికల్లో శ్రామిక్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు మాట్లాడుతూ యాజమాన్యంతో రాజీ లేని పోరాటం చేశామన్నారు. ఈ నెల 29న మర్రిపాలెంలో నిర్వహించే శ్రామిక గర్జన సభకు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జోనల్ అధ్యక్షుడు పీవీజే రాజు, జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.